క్లుప్తంగా

అండర్ డ్రైయినేజీ పనులు ప్రారంభం

నవాబుపేట: మండలంలోని కాకర్లపహాడ్ గ్రామంలో సోమవారం అండర్ డ్రెయినేజీ పనులు గ్రామస్తులు ప్రారంభించారు. దాదాపు రూ.10 లక్షలతో కూడిన నిధులను జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి గ్రామానికి మంజూరు చేయించారు. మైనోద్దీన్, వీరాంజనేయులు, నర్సింహులు, మల్లేష్,శ్రీను, ఆనంద్, బక్క నర్సింహులు, రవి ఉన్నారు.

మొక్కల పెంపకంపై అవగాహన కల్పించాలి



నవాబుపేట: విద్యార్థులకు బాల్యం నుంచే మొక్కల పెంపకంపై అవగాహన కల్పించాలని ఎంఈఓ నాగ్యానాయక్ అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ స్కూల్‌లో ఆయన ఉపాధ్యాయ సంఘాల నాయకులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మొక్కలు నాటడం అందరూ అలవాటు చేసుకోవాలన్నారు. సీఆర్‌పీ జనార్ధన్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు యాదయ్య, విజయ్‌కుమార్, శ్యాంసుందర్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

స్టేషన్ మహబూబ్‌నగర్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ అని అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తమ సొసైటీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. దేశాన్ని సూపర్‌పవర్‌గా మార్చడంలో విద్యావ్యవస్థ ఎంతోగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యతో పిల్లలు సమాజంలో నైతికత, నాగరికత గురించి తెలుసుకుంటారని అన్నారు. పిల్లలను ప్రోత్సహించడంలో తల్లిదండ్రుల పాత్ర ముఖ్యమైందన్నారు.

రామలింగేశ్వరాలయంలో హుండీ లెక్కింపు



అడ్డాకుల: కందూర్ శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం స్వామి వారి హుండీని లెక్కించారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వీణాధరి, ఈఓ రాజేశ్వరశర్మ ఆధ్వర్యంలో గ్రామస్తులు, పాలమూరు యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు కలిసి హుండీని లెక్కించారు. ఇటీవల ముగిసిన స్వామి వారి బ్రహ్మోత్సవాలు, జాతర ద్వారా సుమారు 40 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. ఇందులో సుమారు రూ.5.13 లక్షల నగదు, కానుకల ద్వారా ఆలయానికి ఆదాయంగా లభించినట్లు ఈఓ రాజేశ్వరశర్మ తెలిపారు.

పాఠశాలకు కంప్యూటర్ అందజేత



అడ్డాకుల: మండలంలోని పెద్దమునుగల్‌ఛేడ్ పాఠశాలకు సోమవారం అదే గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ హన్మంత్‌రెడ్డి, భవాని దంపతులు కంప్యూటర్‌ను అందజేశారు. పాఠశాలలో చదువుకునే విద్యార్థులు ఉన్నత చదువులు చదివి గ్రామానికి మంచి పేరు తేవాలని, పాఠశాలకు కావాల్సిన వసతుల కల్పనకు తాము సహకరిస్తామని దాత హన్మంత్‌రెడ్డి తెలిపారు. కంప్యూటర్ అందజేసిన ఆ దంపతులకు గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

తల్లీబిడ్డను కాపాడిన 108 సిబ్బంది

జడ్చర్ల: మండలంలోని లింగంపేట గ్రామ శివారులో బొగ్గు బట్టీల్లో పనిచేసే కూలీ రమాదేవి సోమవారం బట్టీల వద్దనే పండంటి బిడ్డను జన్మనిచ్చింది. అయితే ప్రసవం అనంతరం తల్లీబిడ్డలకు అనారోగ్య సమస్యలు రాగా 108 సిబ్బంది అక్కడికి చేరుకొని ప్రాథమిక చికిత్స అందించి వారి ప్రాణాలను కాపాడారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం జడ్చర్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నేడు ప్రభోత్సవం

దేవరకద్ర: మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవస్థానం 96 వ సప్తాహ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున ప్రభోత్సవం నిర్వహించడానికి దేవస్థాన కమిటీ ఏర్పాట్లను చేశారు. దేవాలయం వద్ద ప్రభోత్సవ రథానికి రంగులు వేసి ముస్తాబు చేశారు. సప్తాహ మహోత్సవాల సందర్భంగా ఆయా దేవాలయాల్లో నిత్య పూజలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఐదు రోజులుగా దేవాలయాల్లో అఖండ భజనలు కొనసాగుతున్నాయి. పగలు, రాత్రి నిరంతరం వంతులవారీగా భజన మండలి వారు భజనలు చేస్తున్నారు.

నీటిఎద్దడి నివారణకు చర్యలు

- పాడైన బోర్లకు మరమ్మతు
- కొత్త మోటార్లు బిగించేందుకు ఏర్పాట్లు
- క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి
- మున్సిపల్ సమీక్ష సమావేశంలో తీర్మానం



నీటి సమస్యపై సమీక్ష నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలో తాగునీటి ఎద్దడి నివారణకు మున్సిపల్ పాలకవర్గం, అధికారులు చర్యలు చేపట్టారు. వార్డు కౌన్సిలర్లు ఒక్కొక్కరుగా నీటి సమస్యను లేవనెత్తుతుండటంతో ఎట్టకేలకు పాలకవర్గం స్పందించింది. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, అధికారులు, మున్సిపల్ నీటి విభాగం, మిషన్ భగీరథ సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటుచేశారు. మూడు రోజులుగా మల్లెబోయిన్‌పల్లి పంప్‌హౌస్ నుంచి మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా రాకపోవటంతో కావేరమ్మపేటలో నీటి సమస్య ప్రారంభమైంది. దీంతోపాటు పలువార్డుల్లో బోరు మోటార్లు పాడై నెలలు గడుస్తున్నా వాటిని మరమ్మతు చేయకుండా ఉన్నారు. 2, 5, 10, 11, 12, 14, 17 మొత్తం 8వార్డుల్లో మోటర్లు కాలిపోయాయి. వాటిని ఇప్పటి వరకు మార్చకుండా ఉన్నారు.

కొత్తమోటార్ల కొనుగోలు

గత ఏడాది వేసవికాలంలో తాగునీటి సమస్య తీర్చటం కోసం రూ.44లక్షలు విడుదల కాగా వాటిలో కేవలం 23లక్షలు మాత్రమే వివిధ స్కీంల కోసం వెచ్చించారు. మిగిలిన రూ.20 లక్షలు అలాగే ఉండిపోవటంతో ఆ నిధుల ద్వారా మొత్తం 13కొత్త మోటార్లు కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన వాటిలో సింగిల్ ఫేస్ 1 హెచ్‌పీ మోటార్లు 3, 1.5హెచ్‌పీ మోటార్లు 3, 5హెచ్‌పీ మోటార్లు 3, 7.5 హెచ్‌పీ మోటార్లు 2, 30హెచ్‌పీ మోటార్లు 2 కొనుగోలు చేశారు.

అప్రమత్తంగా ఉండాలి

నీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నందున నీటి విభాగం సిబ్బంది క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి సూచించారు. కొత్తగా తీసుకువచ్చిన మోటార్లను వెంటనే బిగించాలని సిబ్బందిని ఆదేశించారు. మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా అయ్యేలా చూడాలని మిషన్ భగీరథ ఏఈకి సూచించారు. సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. మిషన్ భగీరథ, మున్సిపల్ వాటర్ ఏఈలు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. కావేరమ్మపేటలో 30హెచ్‌పీ మోటార్ బిగించి నీటి సరఫరాను సరిచేయాలని తద్వారా 9వార్డుల్లో సమస్య ఉత్పన్నం కాదన్నారు. మరో 30హెచ్‌పీ మోటార్ అందుబాటులో ఉంచుకొని అవసరమైతే వినియోగించాలన్నారు. మిషన్ భగీరథ ఏఈ వినోద్, మున్సిపల్ ఏఈ గాయత్రి, వాటర్ సిబ్బంది, వార్డు కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, బుక్క మహేష్, కుమ్మరి రాజు, నాయకులు కోనేటి నర్సింహులు, కృష్ణారెడ్డి, కొండల్ పాల్గొన్నారు.



కొత్తగా కొనుగోలు చేసిన మోటర్లు

ప్రతి గింజనూ కొంటాం

- వరి వేస్తే పండుగే
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- మన్యంకొండ చౌరస్తాలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: రైతు పండించిన ప్రతి గింజనూ కొంటామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం మండలంలోని మన్యంకొండ చౌరస్తాలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నాడు వరి వేస్తే ఉరి అన్నారని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరి వేస్తే పండుగ అయ్యిందని అన్నారు. ఏకకాలంలో రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేసి 25లక్షల రైతు కుటుంబాల్లో సంతోషం నింపామని, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలతో రైతులను రాజులను చేస్తున్నామన్నారు. రైతుల నుంచి 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి, రేషన్ షాపుల్లో ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వెంకటేష్, మేనేజర్ రవినాయక్, ఏఓ శృతి, ఏఈఓ కృష్ణకాంత్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, పీఏసీఎస్ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, నాయకులు మల్లు అనిల్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, ధర్మాపూర్ నర్సింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, పోతన్‌పల్లి మోహన్‌రెడ్డి, గోవింద్‌యాదవ్, వెంకట్రాములు, చర్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉంది

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం మహబూబ్‌నగర్ రూరల్ మండలానికి చెందిన 511మంది లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 144 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేశారు. ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాములుయాదవ్, నాయకులు షబ్బీర్ అహ్మద్, గంజి ఆంజనేయులు, అవేజ్, ఖాజపాష, చిన్న, మోసీన్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

మహబూబ్‌నగర్ రూరల్: జ్ఞాన నీలి బహుజన మహనీయుల శోభాయాత్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించబోయే శోభాయాత్రకు రావాలని ఆకమిటీ నాయకులు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని సోమవారం కలిసి ఆహ్వానించారు. కమిటీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పాతూరు రమేష్, కోఆర్డినేటర్ సింగిరెడ్డి పరమేశ్వర్, నాయకులు కాలె నరేందర్, అంజన్న, వినయ్ కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పీర్ల పండుగను జాతీయ పండుగగా గుర్తించాలి



స్టేషన్ మహబూబ్‌నగర్: పీర్ల పండుగను తెలంగాణ జాతీయ పండుగగా ప్రభుత్వం గుర్తించాలంటూ సోమవారం రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌కు పీర్ల పండుగ నిర్వాహకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టన్న, నాయకులు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ సాంస్కృతిక పర్వదినాల్లో పీర్ల పండుగకు ప్రత్యేకస్థానం ఉందన్నారు. పీర్ల చావిడిలకు సంబంధించిన భూములు అన్యాక్రాంతమైనవని, వాటిని పీర్ల పండుగ నిర్వహణ కోసం సేవ చేస్తున్న ముల్లాలకు, పీర్లు పట్టే వారికి ఇవ్వాలని కోరారు. టీఎఫ్‌టీయూ నాయకులు ఎస్‌ఎం.ఖలీల్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్లను తీసుకొచ్చి నిరసన



అడ్డాకుల: పోల్కంపల్లి పెద్దవాగు ఇసుక రీచ్ నుంచి ఆన్‌లైన్ ఇసుక రవాణా నిలిచిపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామంటూ పోల్కంపల్లి, జానంపేట, తిమ్మాపూర్, వేముల, తాళ్లగడ్డ, కొమిరెడ్డిపల్లి, రావులపల్లి గ్రామాలకు చెందిన ట్రాక్టర్ల యాజమానులు నిరసన తెలిపారు. సోమవారం మూసాపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఏడు గ్రామాలకు చెందిన ట్రాక్టర్ల యాజమానులు తమ ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయం వద్దకు తీసుకొచ్చి తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఆన్‌లైన్ ఇసుక రవాణా చేయడానికి ప్రభుత్వానికి సుమారు రూ.25వేలను డీడీ రూపంలో చెల్లించామని, ఇప్పుడు రవాణా నిలిచిపోవడంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు ట్రాక్టర్ల యాజమానులు వాపోయారు. కొన్నాళ్ల నుంచి అధికారులను కలుస్తున్నా పెద్దగా ప్రయోజనం ఉండటం లేదన్నారు. ప్రస్తుతం డ్రైవర్ల జీతాలు, ఈఎంఐలు కట్టలేని పరిస్థితి ఏర్పడినందున వెంటనే పోల్కంపల్లి రీచ్ ద్వారా ఆన్‌లైన్ ఇసుక రవాణాను పునఃప్రారంభించాలని కోరారు. తిరుపతయ్య, జనార్దన్‌రెడ్డి, నాగేష్, రాజేందర్‌గౌడ్, టిల్లు, నాగయ్య, అంజనేయులు తదితరులున్నారు.

పారితోషికం విడుదలపై పీఆర్టీయూ హర్షం



స్పాట్ వ్యాల్యుయేషన్ కేంద్రం వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న పీఆర్టీయూ నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం గత విద్యాసంవత్సరంలో పేపర్ వ్యాల్యుయేషన్ నిర్వహించిన ఉపాధ్యాయులకు స్పాట్ పారితోషికం విడుదల చేయడంపై పీఆర్టీయూ సంఘం నాయకులు హర్షం వ్యక్తంచేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్ స్పాట్ వ్యాలువేషన్ కేంద్రంవద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మదన్‌మోహన్‌యాదవ్, సుధాకర్‌రెడ్డి మాట్లాడారు. చాలా కాలంగా రెమ్యూరేషన్ పెండింగ్ ఉన్న క్రమంలో ఈవిషయాన్ని సంఘం తరపున ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి దృష్టి తీసుకెళ్లామన్నారు. అయన సంబంధిత రాష్ట్ర విద్యాశాఖ అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేశారన్నారు. సుమారు రూ.68 లక్షలను ప్రభుత్వం విడుదల చేయడం గొప్ప విషయమని, సంబంధిత నిధులను అధికారులు ఉపాధ్యాయుల ఖాతాల్లో జమచేశారన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు బుచ్చారెడ్డి, గద్వాల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిమ్మారెడ్డి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలి

తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ధర్నా



అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ పట్టణంలోని వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రాములు మాట్లాడుతూ వీరన్నపేట నుండి చక్కనిరాయి వరకు డబుల్ బెడ్‌రూం కాలనీకి సరైన రోడ్డు సౌకర్యం లేదన్నారు. డ్రెయినేజీ పైపులు పగిలి దుర్వాసన వస్తుందని అన్నారు. 2020లో మాజీ మంత్రి కేటీఆర్ మహబూబ్‌నగర్ పర్యటనకు వచ్చినప్పుడు జెడ్పీ హాల్‌లో డబుల్ బెడ్‌రూంల పంపిణీ కోసం డిప్పు తీశారని, ఈ డిప్‌లో 34 మందికి టోకెన్లు ఇచ్చి దానిలో ఉన్న నంబర్ ప్రకారం వారి ఇళ్ల నివాసం ఉంటున్నారని, ఇటీవల ఇళ్లను ఖాళీ చేయమని అధికారులు వేధిస్తున్నారని ఇది ఎంతవరకు సమంజసమని అన్నారు. అనంతరం డీటీ దేవేందర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి చంద్రకాంత్, నాయకులు రాజ్‌కుమార్, తిరుమలయ్య, రామకృష్ణ, కుర్మయ్య, జయమ్మ, రాజు, నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

కోయిల్‌కొండ: మండలంలోని గార్లపహాడ్ గేటు సమీపంలో గ్రామ యువజన సంఘం అధ్యక్షులు రాఘవేందర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం పంచాయతీరాజ్ డిప్యూటీ ఇంజినీర్ సురేందర్‌రెడ్డి, సీనియర్‌నాయకులు వెంకటోరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రతిసంవత్సరం చలివేంద్రం ఏర్పాటు చేయడం పట్ల రాఘవేందర్‌రెడ్డిని వారు అభినందించారు.

చలివేంద్రం ప్రారంభం

నవాబుపేట: మండలంలోని యన్మన్‌గండ్లలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాంనాయక్ ప్రారంభించారు. మండల కేంద్రంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారి తన సొంత ఖర్చుతో పాత బస్టాండ్ చౌరస్తాలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



కాంగ్రెస్ కార్యకర్త మోష కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం కౌకుంట్ల మండలం ముచ్చింతలలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మోష అనారోగ్యంతో మరణించారు. ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆర్థికసాయం అందజేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మరో కార్యకర్త బుచ్చిలింగం అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలుసుకొని ఆయన పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నాడు. కార్యక్రమంలో టీపీసీసీ సంయుక్త కార్యదర్శి అరవింద్‌కుమార్‌రెడ్డి, కురుమూర్తిస్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, నాయకులు మైపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, కోట్ల తిరుపత్‌రెడ్డి ఉన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ మనందరి బాధ్యత



గాధిర్యాల్‌లో బాపూ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసిన నాయకులు

మహమ్మదాబాద్: రాజ్యాంగ పరిరక్షణ మనందరి బాధ్యత అని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కేఎం నారాయణ, మాజీ ఎంపీపీ శాంతిబాయి అన్నారు. జైబాపు, జైభీం, జైసంవిధాన్ కార్యక్రమంలో బాగంగా సోమవారం మండలంలోని ఆముదాలగడ్డతండా, గాధిర్యాల్, బోరింగ్ తండాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కుల, మత విద్వేషాలతో ప్రజలకు విడదీయాలని చూస్తుందని, అలాంటి వాటిని నమ్మకుండా ప్రజలు ఐకమత్యంతో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ సెల్ మండలాధ్యక్షుడు ముకుందం, వేణుగోపాల్‌రెడ్డి, కేశవులు, బాల్‌రాజ్, రాజేందర్ పాల్గొన్నారు.

ఫూలే జయంతిని ఘనంగా నిర్వహించుకుందాం



సమావేశంలో నినాదాలు చేస్తున్న నాయకులు

జడ్చర్ల టౌన్: ఈనెల 11న మహాత్మజ్యోతిబాపూలే 198వ జయంతిని గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించుకుందామని పూలే ఫౌండేషన్ చైర్మన్ మీనగ గోపి బోయ, ఓబీసీ దళిత ముస్లిం ఆలిండియా వ్యవస్థాపక అధ్యక్షుడు ఫకీర్ జహంగీర్ పిలుపునిచ్చారు. సోమవారం మండల విద్యావనరుల కేంద్రం ఆవరణలో ఏర్పాటుచేసిన ప్రజాసంఘాల సమావేశంలో వారు మాట్లాడారు. సమ సమాజ నిర్మాత, సంఘ సంస్కర్త, బడుగు బలహీన వర్గాలకు విద్యను అందించిన గొప్ప సంఘ సేవకుడు జ్యోతిబాపూలే జయంతిని ఘనంగా నిర్వహించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. సమావేశంలో సావిత్రిబాయి పూలే ఫౌండేషన్ సీఈఓ పరమేశ్వరి, రజకసంఘం జాతీయ మహిళా అధ్యక్షురాలు నవిత రాణి, గొల్లపల్లి మాజి సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు గోపాల్, యాదయ్య, చిట్టెమ్మ పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల ధర్నా



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేసి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధి కూలీలు

దేవరకద్ర: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఉపాధి హామీ కూలీలు సోమవారం ధర్నా నిర్వహించారు. దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలో విలీనం చేసిన బలుసుపల్లి, మీనుగోనిపల్లి, చౌదర్‌పల్లి, పెద్దగోప్లాపూర్ గ్రామాల ఉపాధి హామి కూలీలు నిరసన తెలిపారు. విలీన గ్రామాల్లో ఆకస్మాత్తుగా ఉపాధి పనులు నిలిపేయడంతో ఆయా గ్రామాల్లో వెయ్యి కుటుంబాలు జీవనోపాధి లేక రోడ్డున పడాల్సి వచ్చిందని వారు ఆరోపించారు. దాదాపు అరగంట పాటు ధర్నా నిర్వహించి ఎంపీడీఓ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ విషయం డీఆర్‌డీఓ దృష్టికి తీసుకెళ్తామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు. నాలుగు గ్రామాలలో ఉండే కూలీలకు ప్రభుత్వ పరంగా పనులు కల్పించి ఆదుకోవాలని ప్రగతిశీల ఉపాధి హామీ కార్మిక సంఘం జిల్లా నాయకులు సాంబశివుడు కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాధా, కృష్ణయ్య, వీరాంజనేయులు, లక్ష్మమ్మ, పద్మమ్మ పాల్గొన్నారు.

కోఆర్డినేటర్‌ను తొలగించాలని నిరసన



స్పాట్ వ్యాలువేషన్ కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న జీటీఏ సంఘం నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ జీటీఏ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్ ఎస్సెస్సీ స్పాట్ వ్యాలువేషన్ కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, కిషోర్ మాట్లాడుతూ జెడ్పీ యాజమాన్యంలో పనిచేస్తున్న వారికి కోఆర్డినేటర్‌గా నియమించేందుకు అవకాశం లేదని, నిబంధన ప్రకారం గవర్నమెంట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను మాత్రమే కోఆర్డినేటర్‌గా పనిచేసే అవకాశం ఉంటుందన్నారు గత డీఈఓ రవీందర్ వాటిని పట్టించుకోకుండా అక్రమంగా కోఆర్డినేటర్‌ను నియమించారని, అధికారులు చేసిన తప్పిదాన్ని సరిదిద్దుకుని వెంటనే కోఆర్డినేటర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు.శ్రీనివాసులు, నాగరాజు, అంతిరాంనాయక్, వెంకటస్వామి, చంద్రశేకర్, రాములు, పుష్పలత, సరోజ, స్వప్న పాల్గొన్నారు.

కార్మిక సదస్సుకు కార్మికులు తరలిరావాలి

చిన్నచింతకుంట: హైదరబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం నిర్వహించే సార్వత్రిక కార్మిక సమ్మె సన్నాహక సదస్సుకు వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కోళ్ల వెంకటన్న, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు జీఎస్ దేవదానం కోరారు. సోమవారం సార్వత్రిక కార్మిక సమ్మె సదస్సుపై మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశంలో కార్మికులను విస్మరిస్తుందని ఆరోపించారు. ప్రారిశ్రామిక వేతలకు కొమ్ము కాస్తు కార్మికుల హక్కులను కాలరాస్తుందని మండి పడ్డారు. కార్మికులు చంద్రన్న, కొండన్న, పెంటన్న, వెంకటేష్‌గౌడ్, వెంకటన్నతో పాటు పలువురు ఉన్నారు.

ఏక పక్షంగా బిల్లును ఆమోదించారు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఏకపక్షంగా వక్ఫ్ సవరణ బిల్లును ఆమోదించారని బీఆర్‌ఎస్ పార్టీ మైనార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎంఏ నయిమ్ ఇమ్రాన్ అన్నారు. ఈ మేరకు సోమావారం కలెక్టర్ విజయేందిర బోయికి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు రాజ్యాంగంలోని ఆర్టికల్ 13, 15, 26, 29 లను ఉల్లంఘించి రాజ్యాంగ విరుద్ధంగా బిల్లును పార్లమెంటులో తెచ్చారన్నారు. చట్టం ముందు అందరు సమానమే అనే దానికి విరుద్ధంగా బిల్లు తెచ్చి ముస్లిం సమాజాన్ని గాయపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హరూన్‌రషీద్, రూరుల్లా, అబీద్, ఇబ్రహీం, షబ్బీర్ పాల్గొన్నారు.

బీసీలకే అధ్యక్ష పదవి ఇవ్వాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిని బీసీలకే ప్రకటించాలని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్‌సాగర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీలో కార్పొరేషన్ చైర్మన్లు, నామినెటెడ్ పోస్టుల్లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్ నిలిపివేయాలని వినతి

మిడ్జిల్: మండలంలోని వెలుగోమ్ముల లక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయానికి చెందిన సర్వే నంబర్ 188/1/2 గల 4.06 ఎకరాల భూమిని వెలుగోమ్ములకి చెందిన కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకోనుటకు ప్రయత్నిస్తున్నారని, నిలిపివేయాలని గ్రామపెద్దలు సోమవారం తహసీల్దార్ రాజుకు వినతిపత్రం సమర్పించారు. దేవాలయ భూములు నంభి వంశీయుల పేరిట ఉండడంతో 40ఏళ్ల క్రితం మరణించిన నంభి శేషమ్మకు అప్పట్లో వారసులు లేరు. 2003లో ఆమె మరణించినట్లు తప్పుడు మరణ ధ్రువపత్రాన్ని సృష్టించి ఈ భూములు కాజేసేందుకులు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దేవాలయ భూములను ఆక్రమణకు గురికాకుండ కాపాడాలని కోరారు.

బలమైన శక్తిగా బీజేపీ

పాలమూరు: ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా బీజేపీ అవతరించిందని ఆ పార్టీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శాంతికుమార్ నివాసం దగ్గర సోమవారం బీజేపీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1984లో కేవలం రెండు స్థానాల్లో గెలుపొంది ప్రాస్థనం ప్రారంభం చేసి ప్రస్తుతం బలమైన శక్తిగా ఎదిగిందన్నారు.